# రేపటి ఆశ

-కాకాని కమల

"అమ్మాయ్ తనూ."

సాయంసంధ్య పెరట్లో తులసికోట ముందు అలికి ముగ్గులు పెడుతోన్న తనూజ వీధి తలుపులు బోర్లా తెరుచుకున్న శబ్దం, తండ్రి కంఠం వింటూ చేతిలో ముగ్గుగిన్ని పక్కన పెట్టి గబగబా వంట గదిలోకి వచ్చింది "వస్తున్నా నాన్నా" అంటూ గ్లాసునిండా చల్లటి నీళ్ళు నింపి అలవాటుగా వసారాలోకి రాబోయింది.

వసారాలో తండ్రితోపాటు ఎవరో యువకుడు కుర్చీలో కూర్చొని ఉండటం చూసి చప్పున అడుగు వెనక్కివేసి తలుపుచాటుకు ఒదిగింది.

శేషాద్రి చిరునవ్వుతో కూతురికేసి చూస్తూ "ఫరవా లేదులే తల్లి. ఇక్కడ పరాయి వాళ్ళు ఎవరూ లేరులే ఆ నీళ్ళగ్లాసు ఇటుపట్రా." అన్నాడు.

తనూజ ముందుకి వచ్చి ఆ నీళ్ళగ్లాసు తండ్రికి అందించింది.

శేషాద్రి గ్లాసు ఆ యువకుడికి అందిస్తూ-

"మా అమ్మాయి తనూజ, అమ్మా తనూ! ఇతనెవరు అనుకుంటున్నావ్? మనం రుద్రారంలో ఉండగా మన సందుచివర విశ్వనాథంగారని రెవిన్యూ ఆఫీసరగారుండే వారు గుర్తున్నారా? వాళ్ళ అబ్బాయి పార్థసారథి. మనం అందరం పార్థీ అనే వాళ్ళం. నాతో చదరంగం ఆడటానికి



వచ్చేవాడు అతనే ఈ పార్థీ." అన్నాడు.

తనూజ చిన్నగా నవ్వి చేతులు జోడించింది.

పార్థుకూడా రెండు చేతులు జోడించి తనూజ ముఖంలోకి చూస్తూ పలకరింపుగా ఏదో అనబోయిన వాడల్లా షాక్ తిన్నట్టు ఆగిపోయాడు.

అతడి ముఖంనిండా విభ్రాంతి, కళ్ళనిండా ఎన్నో ప్రశ్నలు.

అది గమనించిన తనూజ ఖాళీగ్లాసు తీసుకుని గబగబా లోనికి వెళ్ళిపోయింది.

లోనికి వెళ్ళిపోతోన్న తనూజకేసి ఓరకంట చూస్తోన్న పార్థుని గమనించిన శేషాద్రి చిన్నగా నిట్టూరుస్తూ అన్నాడు.

"తనూజకి నిరుడు ఈరోజుల్లోనే పెళ్ళి చేశాను. కానీ దాని విధి వక్రించింది. పెళ్ళయిన ఆరునెల్లకి రైలు ప్రమాదంలో అల్లుడు చనిపోయ్యాడు.

దీని పాదం మంచిది కాదని అత్తింటి వారు నానా దూషణలూ ఆడారు.

ఆక్సిడెంట్‌లో పోయిన వాళ్ళకి రైల్వే వాళ్ళు ఏదో కాంపన్ సేషన్ అని ఇచ్చారు. కాని తనూజ అత్తింటివాళ్ళు దీనికి ఆ డబ్బుకూడా దక్కనివ్వలేదు.

సంతకాలన్నీ దీని చేత పెట్టించుకున్నారు. డబ్బు వాళ్ళకి దక్కించుకున్నారు.

అయినా దీన్ని కాస్త ఆదరించి ఉంటే బాగుండేది. కానీ వాళ్ళ సూటిపోటి మాటలు పడలేక ఇది ఒకసారి ఆత్మహత్యకి ప్రయత్నించింది. ఎవరూ కాదన్నా కన్న తండ్రిని ఇంకా నేను బ్రతికే ఉన్నాను. అందుకే తెచ్చి దగ్గర పెట్టు కొన్నాను.

నా భార్య చనిపోయింది. అదృష్ట వంతురాలు. పసుపు కుంకుమలకి దూరం అయినదాన్ని నిత్యం ఇలా చూస్తూ చిత్రవధ అనుభవిస్తున్నాను."

పార్థీ విభ్రమంగా చూశాడు.

"ఇంత చిన్న వయసులో తనూజకి ఇంత కష్టం వచ్చిందా?"

"అవును బాబూ"

"కానీ కానీ అసలు తనూజ వయసు ఎంతని?"

"ఇరవై ఒకటి."

"ఇంత చిన్న వయసులో భర్త చనిపోయినంత మాత్రాన పసుపు కుంకాలు ఎందుకు విడిచి పెట్టాలి? ఇప్పుడందరూ పెట్టుకుంటున్నారు కదా?"

"నిజమే కానీ నా అక్కచెల్లెళ్ళూ, మా ఆవిడ తరఫు అక్కాచెల్లెళ్ళూ అందరూ 'కాలం ఎంతమారినా సంప్రదాయ విరుద్ధంగా చేస్తే ఏం కీడు మూడుతుందో... అదీనక మళ్ళీ పెళ్ళి చేసుకుంటే ఆదారివేరు' అన్నారు వాళ్ళంతా. ఆ మాటలు పట్టుకుని తనూజ బొట్టూ, గాజులూ తీసేసింది."

"అక్కడికీ నేను చెప్పాను ఇంకా కొత్తగా కీడు మూడేదేంలేదు తల్లీ. అలా బోసిగా నా కళ్ళముందు తిరక్కు నీ ఈడు వాళ్ళకి ఇంకా పెళ్ళిళ్ళే కావటం లేదు. అని చెప్పాను. కానీ దాని మనసు విలగిందో ఏమో అలంకరణ మానివేసింది.

నేను చెయ్యగలిగింది ఏం లేదు చూస్తూ చూస్తూ దీన్ని ఒకమాట అనలేను. దానికి మళ్ళీ పెళ్ళిచేసి దానిబ్రతుకు కళకళలాడేలా చెయ్యాలన్నదే నా ఆశ. మరి ఆ భగవంతుడు ఎంత వరకు సహకరిస్తాడో చూడాలి." కళ్ళల్లో నుండి వచ్చిన నీటిని భుజంమీది ఉత్తరీయంతో తుడుచుకున్నాడు శేషాద్రి.

నిలువునా నీళ్ళు కారినట్లు అయ్యాడు పార్థీ. అతనికి నోట వెంట కొంచెం సేపు మాట రాలేదు.

తనకంటే మూడు సంవత్సరాలు చిన్నది తనూజ. జీవితం అప్పుడే ఇంత పసివాడి పోవటం చూస్తే చాలా బాధ అనిపించింది.

"మరి ఇంతకీ ఏం చెయ్యాలనుకుంటున్నారు మాష్టారూ."

"ఏం చెయ్యటానికైనా నా చేతుల్లో ఏముంది బాబూ! అంతా ఆ పైవాడి దయ. తనూజ భర్త గవర్నమెంటు ఉద్యోగి కావటంతో ఆ ఉద్యోగం దానికి రావాలని కాగితాలు పెట్టించాం. కానీ దాని అత్తవారు పడనివ్వటం లేదు.

తమ కోడలు తమ దగ్గర ఉండడటం లేదనీ, తమతో తెగ తెంపులు చేసుకుందనీ వేరే పెళ్ళి చేసుకునే ప్రయత్నంలో ఉందికాబట్టి ఆ ఉద్యోగం ఆమెకి ఇవ్వటానికి వీల్లేదనీ కేసు పెట్టారు. ఈ గొడవల్లో ఆఫీసుల్లో దాని ఉద్యోగం ఆర్డర్ బయటికి రావడం లేదు.


తనూజ మాతో ఉంటే మా వియ్యంకుడు పై అధికారులకి బాగా డబ్బు తినిపించి ఆ ఉద్యోగం అయన చిన్నకొడుక్కి వేయించుకోడానికి ప్రయత్నిస్తున్నాడని తెలిసింది. పైగా మా వియ్యంకుడి ఆఖరి తమ్ముడు ఆదే ఆఫీసులో పెద్ద సీట్లో ఉన్నాడు. దాంతో గాలి వాళ్ళ వైపే ఉంది.

నాకు పెద్ద పలుకుబడిగానీ చేతిలో డబ్బుకానీ లేదు. అందుకే ఎటూ తోచక ఉండిపోతున్నాను. తనూజకి దాని భర్త ఉద్యోగం వచ్చిందా సరే. లేకపోతే నేను నా సర్వీసు పూర్తికాక ముందే అంటే రెండు సంవత్సరాలముందే వాలంటరీ రిటైర్‌మెంటు తీసుకుంటాను.

నా ఉద్యోగం నా సంతానంలో ఒకరికి వచ్చే అవకాశం ఉంది. ఆ విధంగా నా ఉద్యోగం తనూజకి వేయిద్దామనుకుంటున్నాను. ఈలోగా అది వేరే కాంపిటీటివ్ ఎగ్జామ్స్ అవీ రాసి అది వేరే ప్రయత్నాలు చేస్తోంది. ఆవేమన్నా వచ్చాయాసరే లేకుంటే నేనే ఏదన్నా ఆధారం చూపించాలి గదా?" అన్నాడు శేషాద్రి.

పార్థు నిశ్శబ్దంగా ఉండటం చూసి ఆయన "ఏంటి, నువ్వు గడపలోకి వచ్చినప్పట్నుంచి నా కష్టాలు సోది వెళ్ళబోసుకోవటం మీ తోటే నిన్ను విసిగిస్తున్నాను. ఇంతకీ నీ సంగతి ఏమీ చెప్పనే లేదు. ఎలా ఉన్నావ్?ఏం ఉద్యోగం చేస్తున్నావ్?

ఆ రోజుల్లో ఏవో ఆదర్శాలు అంటూ తరచూ సభలు సమావేశాలు ఏర్పాటు చేసేవాడివి. ఆ రోజు ల్లోనే ఏదో సంఘం... అదేమిటి? అభ్యుదయపథం అనుకుంటాను ఆ సంఘం పేరు స్థాపించావు కదా? ఇప్పుడూ అలాగే ఉన్నావా?"




డి. శ్రీనివాస రావు, గొల్లెల్ల వీధి, గురద (తా), బెరంపురం - 760 001.

## ఆమని మనసు

ఆమని నటించిన అన్ని చిత్రాలూ హిట్ చిత్రాలే! పైగా 'ఎక్స్‌పోజింగ్‌కి రెడీ' అంటూ అంగీకరించడంతో - నాభీ సౌందర్యాలూ, పైట జార్చడాలూ, వానల్లో, కొలనుల్లో, జలపాతాల్లో తడవడాలూ వగైరా సన్నివేశాన్ని రసమయంగా పండించగలుగుతోంది. నటనలో కూడా మంచి ప్రావీణ్యం ఉంది. ఇన్ని ఎస్సెట్స్ ఉండగా, దానికి సక్సెస్ తోడవగా ఇంక ఎదురేముంది! అందుకే పుంఖానుపుంఖాలుగా అవకాశాలు వస్తున్నాయి. అందాల ఆమనికి టెన్నిస్ ఆటంటే అమిత ఇష్టం. టెన్నిస్ స్టార్ స్టెఫీగ్రాఫ్ అంటే చెప్పలేనంత అభిమానం.

ఈ ప్రపంచంలో తనకి అత్యంత ప్రాణప్రదమైన విషయం 'సినిమా' అని చెప్తోంది. నటించడమొక్కటే తన ధ్యేయమని, నటనే తాను ప్రేమిస్తున్నాననీ ఉద్ఘాటిస్తోంది.



ఎరుపురంగు అంటే ఇష్టపడే ఈ లేతగులాబీ సోయగాల సొగసరికి చిన్నపిల్లల కథలు చదవడమంటే ఆసక్తి ఎక్కువట!

-రాజీ

పార్థీ చిరునవ్వుతో చూశాడు.

"అవును మాష్టారూ! ఇప్పటికీ అలాగే ఉన్నాను. ఆ రోజుల్లో నాది ఆవేశమే అయినా ఇప్పుడు ఆలోచనకూడా చోటు చేసుకుంది.

ఇప్పుడు మా సంఘం చాలా బ్రాంచీలు కూడా ఏర్పాటుచేసుకుంది. చాలా మంది యువతరం మా సంఘ సభ్యులుగా చేరారు. చాలా మంచి పన్లు నిర్వహిస్తున్నాం.

ప్రస్తుతం నేను బిజినెస్ చేస్తున్నాను. ప్రభుత్వ ఉద్యోగం మీద ఆసక్తిలేదు. స్వతంత్రం జీవనం, నా ఆశయాల్తో బ్రతకటం నాకిష్టం. ఈ మూఢనమ్మకాలూ, కులమతాలూ, వర్గ విభేధాలూ ఉండకూడదని మా సంఘం స్థాపించాం. దానికే కృషి చేస్తున్నాను."

"చాలా సంతోషం పార్థీ. ఎంతమంది పిల్లలు మీ ఆవిడ ఏం చేస్తోంది."

"ఇంకా పెళ్ళికాలేదు మాష్టారూ. నా ఆశయాలకి తగిన అమ్మాయినే పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను. నీతులు వల్లించటం కంటే ఆచరించి చూపటం ముఖ్యం అనే సిద్ధాంతం నాది."

ఆ మాటతో శేషాద్రి ముఖం వికసించింది.

"చాలా సంతోషం పార్థీ. నీలాంటి వాళ్ళు నూటికి ఒకళ్ళు ఉంటారు."

"అర్జంటు పని మీద సిటీకి వచ్చాను మాష్టారూ. ఇంకో అరగంటలో బస్సుంది. వెళ్ళాలి. టిక్కట్ల రిజర్వేషన్‌కూడా అయిపోయింది. మళ్ళీ ఎప్పుడైనా కలుసుకుందాం" పార్థీ కుర్చీలోంచి లేవబోయాడు.

ఇంతలో తనూజ లోపల్నుంచి ట్రేలో స్వీట్, వేడి పకోడీలు, టీకేటిల్ పట్టుకొని వచ్చి టీపాయ్‌మీద పెట్టింది.

"ఇప్పుడివన్నీ ఎందుకు మాష్టారూ. అనవసరపు శ్రమ." మొహమాట పడ్డాడు పార్థీ.

"శ్రమేం లేదు లేవయ్యా రోజూ మా అమ్మాయి నేను ఆఫీసునుంచి వచ్చేసరికి ఏవో చేస్తూనే ఉంటుంది" అన్నాడు.

ఇద్దరూ టిఫిన్ చేసి టీ తాగారు.

టైము ఆరుదాటుతూంటే పార్థీ బ్రీఫ్‌కేసు పట్టుకుని లేచాడు.

"పద నేను బస్సు స్టాపుదాకా వస్తాను." అన్నాడు శేషాద్రి.

"మీకెందుకు మాష్టారూ శ్రమ. మీరు ఉండండి. నే వెళతాను." అన్నాడు.

"శ్రమేం లేదు పార్థీ నాకూ పనుంది. మా అమ్మాయి కూరలు లేవని ఉదయం చెప్పింది." అంటూ సంచి అందుకుని

"అమ్మా తనూ! మేంవెళుతున్నాం. తలు పేసుకో." అని చెప్పి రోడ్డు మీదికి వచ్చారిద్దరూ.

ఇద్దరూ నిశ్శబ్దంగా నడుస్తున్నారు.

శేషాద్రి ఆఫీసునుంచి ఇంటికి వస్తూంటే చేతిలో బ్రీఫ్‌కేసుతో బస్సు స్టాపు దగ్గర కనిపించాడు పార్థీ.

అనుకోకుండా కనిపించిన స్నేహితుడి కొడుకుని ఆదరంతోపలకరించి "మాఇల్లిక్కడే ఓ అడుగేసి వెళ్ళు" అంటూ తీసుకొచ్చాడు శేషాద్రి.

కాని పార్థీని చూశాక, అతని వివరాలు విన్నాక శేషాద్రి మనసు ఆలోచనలో పడింది.

వెదకబోయిన తీగకాలికి తగిలినట్లు అనిపిస్తోంది. మోడువారిన తనూజ జీవితానికి వసంతుడిలా అనిపిస్తున్నాడు పార్థీ.

"మూఢాచారాలకి నమ్మకాలకి వ్యతిరేకంగా నా ఆశయాలకితగిన అమ్మాయిలభిస్తే పెళ్ళి చేసుకుంటా" అన్న పార్థీ మాటలు ఆయనలో జీవం పోస్తున్నాయ్.

తనూజ నష్టజాతకురాలిగా తన బంధుమిత్రులలో చిన్నచూపు చూడబడుతోంది.

ఈ పరిస్థితిలో అభ్యుదయభావాలుగల పార్థీలాంటి నవయువకులు తప్పించి వేరే ఎవరు ఇందాకా వస్తారా?

మనసులో మాట పార్థీని అడిగితే?... చుట్టం చూపుగా వస్తే దెయ్యం అయి పట్టుకున్నాడు అనుకోడు కదా పార్థీ?

ఊహూ!...

అలా ఎందుకు అనుకుంటాడు.

ఇది దైవ ఘటనగానే జరిగి ఉండవచ్చుకదా?

ఎప్పుడో పది సంవత్సరాల క్రితం విడిపోయిన తాము ఇప్పుడు ఇంత హఠాత్తుగా బజారులో కల్సుకోవటం ఏమిటి? ఇదంతా దైవానుగ్రహమే. పార్థీతో తనూజకి రాసి ఉందేమో!

"ఏమిటి మాష్టారూ ఏం ఆలోచిస్తున్నారు?" పార్థీ భుజంతట్టి పిలుస్తూంటే ఉలిక్కిపడ్డాడు శేషాద్రి.

"బస్సుస్టాండు వచ్చింది అదిగో నా బస్సు స్టేజీలో సిద్ధంగా ఉంది. మరి నే వెళతాను. మీరు ఏవో కూరలు కొనాలన్నారు కదా."

"ఏమిటి మాష్టారూ! ఎలాగో ఉన్నారు?" పార్థీ అనుమానంగా చూశాడు ఆయన ముఖంలోకి.

చల్లకొచ్చి ముంత దాచటం ఎందుకు? ఇంకో ఘడియ ఆలశ్యం అయితే పార్థీ వెళ్ళిపోతాడు. ఆ తరువాత ఎవరికెవరు? అవసరంనాది అడిగితే తప్పేమిటి?

"బాబూ పార్థీ?"

"ఏమిటి మాష్టారూ?"

"నీవు మరోలా అనుకోనంటే ఒక్కమాట."

"అడగండి మాష్టారూ."

"మా తనూజని చూశావుకదా? నిత్యవసంతంలా ఉండవలసిన దాని బతుకు నిత్య శిశిరం అయిపోయింది. దానికి మళ్ళీ పెళ్ళి చెయ్యాలని నా తపన. ఒక తండ్రిగా నా ఆశ తప్పుకాదనుకుంటాను."

పార్థీ ఆవేశంగా అన్నాడు.

"అది ఆశకాదు మాష్టారూ మీ బాధ్యత."

"అందుకే అడుగుతున్నాను పార్థీ. నీకు అభ్యంతరం లేకపోతే దాన్ని నువ్వు పెళ్ళి చేసుకోగలవేమో ఆలోచించు.

నీలాంటి ఆదర్శభావాలుగల వాళ్ళు అయితేనే దాని భవిష్యత్తు సుఖమయం అవుతుంది. దాని భర్తతరపునుంచి గానీ, నా తరపునుంచిగానీ దానికి గవర్నమెంటు ఉద్యోగం వేయించగలను.

నా కూతురని చెప్పటం కాదుగాని చక్కని చుక్క. ఆరోజుల్లోనే దాన్ని కాలేజి బ్యూటీ అనే వారు. దాని నడవడిక గురించి నేను ఎందుకు చెప్పటం. నీకు బాగా తెలుసు."

తన చేతుల్ని పట్టుకున్న శేషాద్రి చేతుల్ని మృదువుగా స్పృశిస్తూ అన్నాడు పార్థీ.

"తప్పకుండా మాస్టారూ. మరీ అంతగా చెప్పక్కర్లేదు. తనూజ పరిస్థితిని అర్థం చేసుకోగలను. మా ఇంట్లో నా పెళ్ళి చెయ్యాలని తొందర పడుతున్నారు. నాకు అత్తకూతురు ఉంది. ఆ అమ్మాయిని చెయ్యాలని అమ్మా నాన్నా కోరిక. కానీ 'నేను నా ఆశయాలకి అనుకూలంగా నాకు నచ్చిన అమ్మాయి అయితేనే పెళ్ళి చేసుకుంటాను లేకపోతే నా పెళ్ళి ఊసెత్తవద్ద'ని చెప్పాను.

వితంతు వివాహాలు చెయ్యాలని వీరేశలింగం గారు చెప్తే 'నీతులు చెప్పటం కాదు నీకొడుక్కి చేసిచూపించు' అన్నారట జనం. అప్పుడు ఆయన తన కొడుక్కి ఒక బాలవితంతువుని ఇచ్చి పెళ్ళి చేశారట.

ఆదర్శం అంటే అలా ఉండాలని నా కోరిక. అమ్మా నాన్నా ఒప్పుకుంటే త్వరలోనే మీకు ఉత్తరం రాస్తాను. ఒకవేళ వాళ్ళు ఒప్పుకోలేకపోయినా నేను ఒక నిర్ణయానికి వస్తే అది మారదు. సరేనా?" అన్నాడు.

ఆ మాటకి శేషాద్రి ఒళ్ళు పులకరించింది.

రెండు కన్నీటి చుక్కలు ఆయన కంటి చివరలనుంచి రాలాయి.

అప్పటికే బస్సు డ్రైవర్ హారన్ కొడుతున్నాడు. బస్సు కదలటానికి సిద్ధంగా ఉంది.

"వస్తాను మాస్టారూ. బస్సు కదులుతోంది." అంటూ షేక్‌హ్యాండ్ చేసి పార్థీ హడావుడిగా బస్సెక్కాడు.

"వెళ్ళగానే ఉత్తరం రాస్తావా పార్థీ?"

"తప్పకుండా మాస్టారూ...బస్సు కదులుతూంది. పార్థీ చెయ్యి ఊపు తున్నాడు.

బస్సు కదిలేదాకా ఉండి కూరలు కొని ఇంటికి వచ్చాడు శేషాద్రి.

★ ★ ★

నాలుగునెల్లు గడిచాయి.

నిత్యం పార్థీ దగ్గర్నుంచి ఉత్తరం కోసం చూస్తున్నాడు శేషాద్రి.

కాని అతని దగ్గర్నుంచి జాబులేదు.

అనవసరంగా అతని గురించి తనూజకి చెప్పి దాని మనసులో లేనిపోని ఆశలు రేపానేమోనని జంజాటన పడుతున్నాడు శేషాద్రి. తనతోపాటు తనూజ కూడా పార్థీ ఉత్తరం కోసం ఎదురుచూస్తోందన్న విషయం ఆయన దృష్టికి రాకపోలేదు.

పార్థీ అంత నమ్మకంగా చెప్పాడు కదా? కనీసం ఉత్తరం రాయలేదే? అతని తల్లీ తండ్రీ ఒప్పుకోలేదా? పోనీ ఆ విషయమైనా రాయచ్చుకదా?

అసలు అతని పూర్తి అడ్రసు తీసుకోక పోవటం పొరపాటైపోయింది. విశాఖలో ఏదో వ్యాపారం అన్నాడు గాని వివరాలు తను అడగలేదు. అతని తండ్రి ఆరోజుల్లో రెవెన్యూ డిపార్టుమెంటులో పనిచేసేవాడు మరిప్పుడు ఎక్కడ ఉన్నాడో? లేదా రిటైర్ అయ్యాడో? ఆ విషయాలు కనుక్కోలేదు తను.

ఏదీ ఆ రోజు అనుకోకుండా బజార్లో కలిశాడు. ఇంటికి తెచ్చాను. మళ్ళీ బస్సు ఉందని హడావుడిగా వెళ్ళి పోయ్యాడు. దారిలో పెళ్ళి ప్రసక్తి వచ్చింది. హడావుడి అయిపోయింది అడ్రసు తీసుకున్నా బాగుండేది. తనే స్వయంగా వెళ్ళి పార్థీ తల్లిదండ్రుల్ని సంప్రదించేవాడు... అనిపించింది.

మళ్ళీ అంతలోనే శేషాద్రి మనసులో నిస్పృహ ఆవరించింది.

ఏమిటో తన చాదస్తంగానీ పార్థీకి తనూజకి చేసుకోవాలని ఉండాలేగానీ, అతను రెక్కలుకట్టుకుని రాక పోతాడా. ఎవరాపగలరు?

అతనికి అసలు మనసు లేదేమో. ఆమాట చెప్పలేక ముఖంచాటు వేశాడేమో అనిపించింది.

మళ్ళీ అంతలోనే ఇంకొక ఆలోచన కూడా వచ్చింది.

ఊహు. సారథి అందరిలాంటి కుర్రాడుకాదు. అతనికి ఆదర్శభావాలున్నాయి. ఆరోజుల్లోనే అంటే అతను స్టూడెంట్‌గా ఉన్నప్పుడే ఏవో సంఘాలూ, సమాజ సేవా అంటూ కార్యకలాపాలు జరిపేవాడు.

ముఖ్యంగా స్త్రీల సమస్యల పట్ల అతనికి అవగాహనా, ఆవేదనా ఎక్కువ. అతడు తప్పక తనూజ గురించి ఆలోచించే ఉంటాడు. ఇవాళోరేపో ఉత్తరం ... ఊహు... స్వయంగా అతనే రావచ్చు కూడా. అతని బిజినెస్ వ్యవహారంలో ఏదన్నా పని ఒత్తిడి వచ్చి ఉంటుంది. పైగా తల్లితండ్రులని సంప్రదించాలి. ఈ కారణాలచేత జాప్యం జరిగి ఉంటుంది.

అతనికి తనూజ గురించి ఇష్టం ఉండాలేగాని ఎవరాపగలరు! ఒకవేళ అతనికి ఆసక్తి లేకపోతే తను చెయ్యగలిగిందేమీలేదనుకున్నాడు శేషాద్రి.

★ ★ ★

మరో రెండు నెలలు గడిచాయి.

పార్థీ నుంచి ఉత్తరం రాలేదు. అతని రాకకోసం ఎదురు చూడటం మాత్రం మానలేదు శేషాద్రి.

తనూజకి భర్త తరపునుంచి వచ్చే ఉద్యోగం కోసం కూడా ఏవోకాగితాలు దరఖాస్తు చేశాడు. వాటికి సంబంధించిన కాగితాల కోసం, ఉద్యోగం ఆర్డరు కోసం కూడా ఎదురు చూడటం దినచర్యలో భాగం అయిపోయింది.

తనూజ ఏవో కాంపిటీటివ్ ఎగ్జామ్స్ రాసింది. కొన్ని ఉద్యోగాలకి ఇంటర్వ్యూలకి హాజరైంది. వాళ్ళుకూడా త్వరలోనే సమాధానం చెప్తామన్నారు. ఆ జవాబులు కోసం నిత్యం ఆశగా ఎదురు చూస్తోంది.

శేషాద్రీ, తనూజా రోజు పోస్టు గురించి ఆరాట పడుతున్నారు.

పోస్టుమాన్ అడపా దడపా ఏవో ఉత్తరాలు ఇస్తూనే ఉన్నాడు.

కాని ఆ ఉత్తరాలు వాళ్ళు ఎదురు చూసేవి కావు.

బంధుమిత్రుల దగ్గర్నుంచి ఏ క్షేమసమాచారాలో లేక మరే కబుర్లో. అంతే!

పార్థీ దగ్గర్నుంచి కానీ, తనూజ భర్త తరపునుంచి వచ్చే ఉద్యోగ విషయం గాని ఏ విధమైన జాబు జాడలేదు.

వస్తుందో రాదో - వస్తే ఎప్పుడు వస్తుందో- అసలు వస్తుందోలేక రాదో- ఏదీ తెలియదు.

కాని ఏదో ఆశ... వాళ్ళని అలా ఎదురుచూసేలా చేస్తూనేఉంది.

"రేపు" మీద "భవిష్యత్తు" మీద కొండంత ఆశ!

రేపటి ఆశ.

ఆ 'ఆశ' అన్న రెండు అక్షరాల పదమే లేకపోతే మనిషి మనుగడ సాగదేమో!...

కె. కమల
ప్లాట్ నం. 15, బ్యాంక్ కాలనీ,
లలితా నగర్
హైదరాబాద్ - 44.



## నేనెప్పుడూ రెడీనే!

అందాలనాయిక సౌందర్యకు ఆర్ట్ ఫిలిమ్స్‌లో నటించడమంటే చాలా ఇష్టం. "కమర్షియల్ చిత్రాల్లో బిజీగా ఉన్నా కానీ ఆర్ట్‌ఫిలిం ఆఫర్ ఇస్తే తప్పకుండా ఆలోచిస్తాను. ఆ చిత్రాల్లో నటించడానికి అవకాశం ఉంటుంది" అంటోంది సౌందర్య. "గ్లామర్‌తోపాటు టాలెంట్ కూడా ఉన్న సౌందర్యకు ఇటువంటి ఆసక్తి ఉండడం అభినందించదగిన విషయం."

-రాజీ